


# గెలుపెవరిది!

పవని నిర్మల ప్రభావతి

గదిలో నూతన వధూవరులిద్దరూ తమ తమ భావాలనూ, వ్యక్తిత్వాలనూ చర్చించుకుంటున్నారు. గది బయట వరండాలో ఇరువేపుల పెద్దలు పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటున్నారు. కానీ అందరి హృదయాలలోనూ అంతర్గతంగా, 'గదిలో వాళ్లిద్దరూ ఏం మాట్లాడుకుంటున్నారో?' అనే కుతూహలం నిండివుంది. ఏమో! ఈ కాలపు కుర్రసజ్జు! నలభై ఎనిమిది గంటలలో దివినుండి భువికెగిసి, చంద్రమండలం మీద కాలుమోపి- అదే వేగంతో దిగి వచ్చిన మానవుడి రాకెట్ స్పీడ్ ప్రతి ఒక్కరి జీవితాల్లోకి తోసుకు వచ్చిందీనాడు. అంచేతే పెళ్లిచూపులకు వచ్చీరాగానే ప్రైవేటు సంభాషణ కావాలంటున్నారు యువకులూ, యువతులు. "లవ్ ఎట్ ఫస్ట్ సైట్" లూ! ఐదు నిముషాల సంభాషణ, తర్వాత ఐదునిముషాలలో గాంధర్వం.... ఆ నెల తిరిగే సరికే అమ్మాయికి వాంతులూ.... అబ్బాయి పెళ్లికి తయారవటమో, పరారు కావటమో.... కొత్త కొత్త కథలు.... ఇలా వున్నాయి గదిబయటివారి లోలోపలి ఆలోచనలు.

గదిలో అబ్బాయి పేరు రామచంద్రం. బి. టెక్. హైదరాబాద్‌లో సూపర్‌వైజర్ జాబ్‌లో మూడునెలల క్రితం కుదురుకున్నాడు. అందం, ఆదర్శాలు, పర్సనాలిటీ, పట్టుదల కలగాపులగంగా

కలిగివున్నవాడు. అమ్మాయి పేరు సీత. బి. ఎస్. సి. బి. ఇడి. కి అప్లై చేసివుంది. ఈ దేశంలోనే సీటొస్తే చదువుతుంది. విదేశాలలో అయితే చదవదు కనుక అక్కడెక్కడికీ అప్లై చెయ్యలేదు. అందం, తెలివీ, పర్సనాలిటీ, చురుకుదనమూ కలిపి మూసపోసినట్లుంది.... ఇద్దరి సంభాషణలకూ పెద్దలు అనుమతించి కేటాయించిన టైము పది నిముషాలు మాత్రమే.

"సీతా! మీరు నా మాటలు బాగా విని, అర్థంచేసుకోండి. అనక పశ్చాత్తాపపడి లాభంలేదు!" అన్నాడు రామచంద్రం కుర్చీలో కూర్చొని, కర్చీఫ్‌తో ముఖమూ, యెదా తుడుచుకుంటూ. ఒక్క నిముషంకూడా వృధాగా కాలక్షేపం చెయదలచలే దతగాడు. సీత అతిగాడి ఎదురుగా మరో కుర్చీలో కూర్చుని వుంది.

"చెప్పండి రామచంద్రంగారూ! విన్నాక నాకు నచ్చితేనే మన పెళ్లి జరుగుతుంది. లేకుంటే లేదు!" అంది సీత. ఆమె అనవసరంగా సిగ్గుపడదల్చుకోలేదు.

"ఆల్‌రైట్! మీ మాటలలోనే మీ ఆత్మవిశ్వాసం అర్థమైంది నాకు. సాంప్రదాయాల బోడిసంకెళ్ల తాలూకు పెళ్లిళ్లంటే నాకు పరమ చిరాకు; అంచేత, కేవలం పాతికమంది ఆహూతులు, వాళ్లు బంధువులు కానీండి, స్నేహితులు కానీండి, నౌకర్లు కానీండి, నాయకులు కానీండి.... మీ వేపువారు కానీండి, మా వేపువారు కానీండి.... ఎవరైనా, ఏమైనా.... పాతికమంది గెస్ట్సుకు మించి వుండకూడదు మన పెళ్లికి. రిజిష్ట్రార్ ఆఫీసుకు వొచ్చినా వాళ్లే, డిన్నర్‌కు వచ్చినా వాళ్లే.... ఏమంటారు?" రామచంద్రం స్పష్టంగా చెప్పాడు.

"పాతికమంది గెస్ట్సుకు కూడా ఒప్పుకోను నేను!" సీత దృఢంగా అంది. కంగుతిన్నాడు రామచంద్రం.

"వ్వాట్?"

"అవును. పాతికమందిలో వధూవరుల్ని మనసారా ఆశీర్వదించేవారెందరు? డిన్నర్‌లో వంకలెన్నేవారెందరు? వధూవరుల భావిజీవితాన్ని గురించి తమతమ వాచాలత ప్రదర్శించేవారెందరు? ఇలా ఈ క్వేషన్స్ వేసుకుంటూ పోతే, చివరకు జీరో దగ్గర తేలుతాం. అంచేత రిజిష్టరు మేరేజ్ కూడా నాకిష్టంలేదు."

"మరి ఎలాటి మేరేజ్ మీకిష్టం?" కుతూహలంగా అడిగాడు రామచంద్రం.

"రిజిష్ట్రారూ, అతిథులూ, ఆహూతుల సాక్ష్యం కావాలా పవిత్రమైన ప్రేమకూ, పెళ్లికీ! 'నీవు నా భర్తవు!' అని నేనూ 'నీవు నా భార్యవు' అని నీవూ, మాటవరుసకి...అలా అంటున్నాననుకోండి...) పరస్పరం అనుకుని కలిసి కాపురంపెట్టడమే బెస్ట్, థ్రిలింగ్ మేరేజ్ కూడా అవుతుంది. ఏం? మన మనస్సాక్షి మీదా, మన మీదా మనకి నమ్మకంలేదా?" ఎమోషనల్‌గా అంది సీత.

"సుపర్బ్! ఈ ఐడియా నాకు రాలేదు సుమండీ! అలాగే చేద్దాం! మీ వ్యక్తిత్వం నాకు బాగా అర్థమయిపోయింది.... తాళికట్టడం, దండలు మార్చుకోవటం, సంతకాలుచెయ్యటం... ఏమీ వద్దు. అంతేకదా మీరు చెప్పింది? గుడ్! ఇక అతి ముఖ్య విషయం చెబుతున్నాను. నా జీతం కేవలం ఆరు వందలు....రోజుకి కాదు. నెలకు. నేను పైసా లంచం పుచ్చుకోను. పై సంపాదన అనే ఆలోచన నాకీజన్మలో రాదు. రానివ్వను. ఆరు వందల రూపాయలు సంపాయించే భర్త- హైదరాబాదు నగర కాపురం అంటే, అమెరికాలో పనివాడికంటే హీనం అని మీరు గుర్తుంచుకోవాలి! అందుకు ఇష్టపడితేనే పెళ్లికి సిద్ధపడండి నాతో!"

"ఓ చిన్న సవరణ. నాకు స్వదేశాభిమానం చాలా ఎక్కువ! అంచేత ఇలా గుర్తుంచుకుంటాను. హైదరాబాద్‌లో ఆరొందలు సంపాదించే నా భర్తకంటే, అమెరికాలోవి పనివాడి బ్రతుకు హీనాతిహీనం అని! అంతేకాదు, నాకు లంచగొండులంటే పరమ అసహ్యం. భర్తని అలాటి జీవితానికి ప్రోత్సహించే భార్యకి ఏ శిక్షవేసినా తప్పులేదు! అవసరమైనప్పుడు నేను ఉద్యోగం చేస్తాను. తప్పేమిటి? అది మనిద్దరి కాపురం గానీ, మరొకళ్లది కాదు కదా?" ఆరిందాలా అంటున్న సీతవేపు ఆశ్చర్యంగా చూశాడు రామచంద్రం. ఆడపిల్లలు హఠాత్తుగా, మగాడికంటే మానసికంగా ఎదిగిపోతారేమో అనిపించింది.

"భర్తకు జీతం ఎంత? అన్నది రూపాయలలో ఆలోచించే భార్యకు ఏనాటికీ సుఖమూ, శాంతీ వుండదు అంటుంది మా అమ్మ. భర్త ఇచ్చే అనురాగపు విలువా, భర్తకు తానివ్వగల సిక శాంతి మాత్రమే నిజమైన ఐశ్వర్యాలు అంటుంది మా అమ్మ...." కొద్దిగా సిగ్గు తొంగిచూసింది సీత కళ్లలో.

"నిజంగా? నిజంగా మీ అమ్మగారలా అంటుంటారా? ఆవిడగారి ఉన్నత సంస్కారానికి నా జోహార్లు.... మా అమ్మా నాన్నగార్ల ఆదర్శం కూడా పైసా కట్నంపుచ్చుకోకూడదని నాకు!" అన్నాడు రామచంద్రం ఉద్విగ్నంగా."

"మీ అమ్మా నాన్నగార్ల ఆదర్శానికి నా జోహార్లు అంది సీత మృదువుగా.... "ఇలాటి తలితండ్రులుంటే దేశంలో వరకట్న సమస్య వుండదు!" అంది మళ్లీ.

"ఔను...."

తూంబయట ఎవరో మెల్లిగా దగ్గిన చప్పుడైంది. రామచంద్రం ముఖం చిట్లించాడు, వాచీ చూసుకుంటూ....

"ఎనిమిది నిముషాలు కూడా కాలేదు. మరో రెండు నిముషాలు టైముంది" అన్నాడు రూం వాకిలిచివరకు వెళ్లి, తల మాత్రం బయటపెట్టి, కంగారుగా తచ్చాడుతున్న సీత మేనమామతో. ఆయన "అబ్బే! అందుక్కాదు.... వూరికే .." అంటూ నసుగుతూ బయటి కెళ్లాడు.

"ఇలా వుంటాయి పెద్దవాళ్ల మూర్ఖత్వాలు. యువత మీదా, వాళ్ల మనోనిగ్రహం మీదా కొస్తయినా నమ్మకం లేని వాళ్లంటే నాకు మంట.... సరే.... మరో విషయం....చెప్పనా?" అన్నాడు రామచంద్రం.

"చెప్పండి!" అంది సీత.

"నేను మన సంసారం కోసం ఆర్థికంగా ఇటు మా తల్లిదండ్రులమీదగానీ, అటు మీ అమ్మానాన్నల మీదగానీ పిసరంత కూడా ఆధారపడను గాక, పడను. స్పష్టంగా చెప్పాలంటే, కట్నం వద్దన్నాను కాబట్టి, కానుకల రూపంలో, ఇంటికి అవసరమైన వస్తువులు అంటూ మీవాళ్లివ్వటం, నేను పుచ్చుకోవటం, స్కూటర్ నుంచి టి. వి. వరకూ అమర్చుకోవటం నా కిష్టంలేదు.... కొత్త కాపురం పెట్టినా, సిల్వర్ (వెండి) పాత్రలలో వండుకున్నా, జర్మన్‌సిల్వర్ (అల్యూమినియం) పాత్రలలో వండుకున్నా, మన డబ్బులోనే జరగాలి....అదీ నా చివరి ఆదర్శం." అన్నాడు రామచంద్రం.

"ఎక్స్‌లెంట్! సరిగ్గా నా భావాలూ అవే! కట్నం వద్దని పైకి చెబుతూ, లాంఛనాలంటూ అన్నీ గుంజేస్తారు కొందరు. కష్టపడి ఒక్కో వస్తువూ సాధించుకున్న దానిలో వుండే తృప్తి, ఆనందం, అపళంగా వచ్చే వస్తువులలో వుండదంటారు మా నాన్న...." అంది సీత ఆనందంగా....

"మీరు నన్ను ఏవేనా ప్రశ్నలు అడగటం కానీ, నాకు సలహాలూ, సూచనలు యివ్వటంగానీ చేయరూ?" అన్నాడు రామచంద్రం.

"ఎందుకు చేయనూ! మనిద్దరం అన్ని విషయాలలోనూ మన అభిప్రాయాలు ఇష్టపడ్డాం. నాకు కొన్ని సరదాలూ, అభిమానాలూ వుండొచ్చు. వాటిని కాదనకూడదు మీరు! మన ఆర్థిక పరిధిలో తీరే సరదాలకు అడ్డుచెప్పకూడదు....నాస్నేహితురాళ్లు,బంధుత్వాల విషయాలలో నాకు వ్యక్తిగతమైన, ఆత్మాభిమానానికి సంబంధించిన అంశం మీద మీరు ఎప్పుడూ విముఖత చూపకూడదు." అంది సీత.

"అలా ఎందుకనుకుంటారు? నా స్నేహితుల్నీ, నా బంధువుల్నీ, వారివారి అభిరుచుల్నీ మీరు గౌరవిస్తారు కదా, నేనూ అంతే!"

"పదినిముషాలకు ఐదుసెకెన్లుంది!" అంది సీత.

"మరి.... మన పెళ్లి....?" రామచంద్రం కళ్లలో అద్భుతమైన వెలుగూ.... ఆరాధన.... ప్రేమ....

సీత నవ్వింది. ఆమె కళ్లు తళుక్కున మెరిశాయి.... మరుక్షణం కళ్లు వాలిపోయాయి

"అద్భుతం!" అనబోయాడు రామచంద్రం.

"మాటలు వినిపించకపోతేనూ...." అంటూ దూసుకువచ్చాడు సీత మేనమామ రూంలోకి....

* * *

ఓ సంవత్సరం గిర్రున తిరిగింది. ఆ సంవత్సరమంతా నిజంగా కష్టాలే పడ్డారు సీతారామచంద్రులు. సీత బిఇడిలో చేరింది సిటీలోనే సీటు వచ్చి. రెండు గదులతో రెండు వందల రూపాయల్ని అద్దెగా మింగేస్తున్న చిన్న ఇల్లు, మండిపోయే కిరోసిన్, బొగ్గుల బస్తా బియ్యం, పప్పులతో, వంటావార్పూ, సీత చదువూ, ఫీజూ, రామచంద్రం ఉద్యోగం, జీతం అంతా అంకెల గారడీలాగ, ఏనెల కానెల ఓ పజిల్‌ను సాల్వ్ చేస్తున్నట్లుగా గడిచింది. అయితే రెండు గదులే రెండంతస్తుల మేడగా, చిరిచాపే రోజ్‌వుడ్ డబుల్‌కాట్‌గా, వారాని కోమారు వెళ్లే, పది రూపాయల లోపు సినిమాహాలే, హనీమూన్ ట్రిప్‌గా, వూహించేసుకుంటూ కాలం గడిపేశారిద్దరూ. సీత బిఇడి పాసైంది. అక్కడే ఓ గరల్స్‌స్కూల్లో ఉద్యోగం వచ్చింది. నెలసరి ఆదాయం హెచ్చింది. కాస్తంత వెసులుబాటు దొరికింది.... సీత పట్ల రామచంద్రం ప్రేమద్విగుణీకృతమైంది.

"అరె! ఈ గాద్రేజ్ టేబుల్. గాద్రేజ్ కుర్చీలు నాలుగూ ఎక్కడివి సీతా! నీ జీతంతో కొనేశావా?" అన్నాడు ఆ సాయంత్రం రామచంద్రం ఆఫీసునుంచి రాగానే.

"నా క్లాస్‌మేట్ సావిత్రి వచ్చింది ఉదయం, మీరలా ఆఫీసు కెళ్లగానే. పెళ్లికి తనని పిలవలేదని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది. కొత్త పద్ధతిలో చేసుకున్నాంలెమ్మనీ, కావలిస్తే చూడు, నా మెళ్లో మంగళసూత్రం కూడా లేదనీ చెప్పి కోపం తగ్గించేసరికి నా తలప్రాణం తోకకు వచ్చింది. పెళ్లికానుకగా, ఈ గాద్రేజ్ ఫోల్డింగ్‌మోడల్ టేబిలూ, నాలుగు కుర్చీలూ, ఏకంగా ఆటోలో పెట్టుకు తీసుకవచ్చింది ఇందాక...."

రామచంద్రం ఆశ్చర్యంగా వింటున్నాడు.

"మావారి కిలాటి కానుకలూ గట్రా ఇష్టంలేదు, వొద్దు పొమ్మన్నాను. వింటేగా? మరో పదిహేనేళ్ల తర్వాత తన కూతురికి పెళ్లి ఇదే మోడల్‌లో చేస్తుందిట. ఆ రోజు ఇవే కుర్చీలూ,

ఇదే టేబిల్- మంచి రంగువేయించి, తిరిగి కానుకగా ఇమ్మంది. అందాకా జాగ్రత్తగా వాడమంది.... కుర్చీ కాలు విరిగినా, టేబిల్ నొక్కుకుపోయినా చంపేస్తానంది.... వాళ్లాయన సిటీలోనే, గాడ్రేజ్ కుర్చీలూ, బీరువాలూ ఏజన్సీ తీసుకుని వున్నాడట. బీరువా కొనదల్చుకుంటే, తమ షాపులోనే కొనమంది!"

"అరె! అవిణ్ణి నేనొచ్చేవరకు వుండమనవలసింది సీతా! చాలా మంచి మాటకారి.... స్నేహశీలిలా వుంది. అలాటి ఆడవాళ్లని.... నేను చాలా అభిమానిస్తాను.... గౌరవిస్తాను.... అవిణ్ణిక నొప్పించకు. ఆ బహుమతులలాగే వుంచెయ్! ఆవిడగారు కోరినట్లు.... పదిహేనేళ్ల తర్వాత.... మనమూ ఇద్దాం మంచి బహుమతి వాళ్లమ్మాయి పెళ్లి సందర్భంలో!" అన్నాడు రామచంద్రం.... రూములో కొత్తగా వెలసిన ఆ టేబిల్, నాలుగు కుర్చీలూ చాలా అందంగా వున్నట్లనిపించాయి. ఇంత వరకూ తమకోసం వచ్చిన స్నేహితులూ, బంధువులూ, అంతా చాపమీదే కూర్చోవలసి వచ్చేది. ఇక ఇప్పుడా బాధ లేదు. మంచి దూరదృష్టితో ఉపయోగకరమైన బహుమతి ఇచ్చిన సావిత్రిని మనసారా అభినందించాడు రామచంద్రం పదేపదే.

"మా అక్కయ్యకు సీమంతం చేస్తారట, మనల్నిద్దర్నీ రమ్మని వ్రాశారు మా అమ్మా, నాన్న!" అంది సీత మరో రోజు.


"అదేదో ఆడవాళ్ల వేడుక సీతా! అదీగాక, ఇద్దరం వెళ్లాలంటే అంతలేసి ఛార్జీలు. ఈ నెల బడ్జెట్ తలకిందులౌతుంది. నువ్వొక్కర్తెవూ వెళ్లిరా, తప్పదు కాబట్టి!"

"అలాగే!"

వారం తర్వాత సీత వచ్చింది. ఇంటి నిండా కొత్తకొత్త స్టీలుసామాన్లు, రెండు వైర్ మంచాలూ, పెద్ద పరుపులూ,

మామూలు సంఘటన :

సినిమాలో యిలా చూస్తాం :




దుప్పట్లూ, ఓ చిన్న ట్రాన్సిస్టర్ రేడియో వుండటం చూసి, రామచంద్రం ఆశ్చర్యపోయాడు.

"ఇవన్నీ ఏమిటి సీతా? సీమంతంలో ఇవన్నీ 'వాయినంలా' ఇస్తారేమిటీ?" అన్నాడు అమాయకంగా.

సీత నవ్వింది. "ఆ స్టీలు సామాను సెట్టంతా, మా మేనమామ కొని, మా అమ్మదగ్గరిచ్చాడట, నేనొస్తే ఇమ్మని. మీరిలాటివి ఒప్పుకోరుకాబట్టి, ఇక్కడికి స్వయంగా పంపమనీ. మంచాలూ పరుపులూ నాన్న కొనిచ్చారు...."

"ఎందుకు తీసుకున్నావ్? మరో రెండునెల లాగితే మనమే తీసుకునేవాళ్లం గదా? ఈ నెల కాస్త పెద్దఇల్లు బాడుగకు తీసుకున్నాం కాబట్టి, వాటికి బడ్జెట్ లేకపోయింది...." రామచంద్రం కోప్పడ్డాడు....

"ఇది మరీ బావుంది. మొన్న మా నాన్న వచ్చినప్పుడు ఆయన చాపమీదేగా పడుకున్నారు? చలికాలంలో హైదరాబాదులో, చాపమీద పడుకుంటే వయసు మళ్లినవాళ్లకి నడుము లెలా పట్టుకుపోతాయో, ఆయనకు అర్థమయిందిట. పైనెలలో మా అమ్మా నాన్నా వస్తారు ఇక్కడికి. పదిరోజులుంటారు. చెరో మంచం, పరుపు కావాలిగా..పంపారు... మొన్నటికి మొన్న మీ అత్తయ్య, మామయ్య వస్తే చాపలమీదే పడుకోబెట్టాం కదా? వాళ్లూ ఇలాగే బాధపడి, మనతో అనలేక వెళ్లుంటారు."

"మరి ట్రాన్సిస్టర్ రేడియో?"

"అక్క ఇచ్చింది. బావ ఎలక్ట్రికల్ ఇంజనీరు గదా? సరదాగా ఇంట్లో తయారుచేశాడుట.... మనకోసం రేడియో...."

"ఇదేనా? ఇంచక్కా చేశాడా?"

"ఇది కాదు. మరోటి. అదికాస్తా వాళ్ల ఫ్రెండు తీసుకుని, ఈ కొత్త రేడియో బదులుగా ఇచ్చాడుట. అక్క ఇచ్చింది."

రామచంద్రానికి అయోమయంగానూ వుంది, ఆనందంగానూ వుంది. అయితే ఏమిటో ఆరాటంగానూ వుంది....

"చూడండి, మనం పెళ్లిముందే అనుకున్నాం. మీ ఆదర్శాలకు నేను అడ్డు చెప్పను. నా స్నేహాలకీ, బంధుత్వాలకీ అడ్డుచెప్పనవి మీరు- స్నేహితులూ, బంధువులూ అన్నాక, వాళ్లవాళ్ల సంస్కారం, ఆర్థికవనరు, చనువునుబట్టి వాళ్లు మన

మీద అభిమానం చూపుతారు. అవి ఈ రోజు తెంచేసుకోవటం ఎలా? తెంచేసుకో మంటే.... తెంచేసుకుంటాను.... నాకు మీకు, మీ సంతోషం ముఖ్యంకాదట్టే!" అంది సీత. కాస్తంత బుంగమూతి పెట్టింది.... మరి కాస్తంత మురిపెమూ వుందామాటలో. రామచంద్రానికి ముచ్చటేసింది.

సీత తనకోసం ఎన్ని త్యాగాలు చేసింది! పెళ్లి ఓ కొత్త తరహాలో జరిగేలా చూచింది. కట్టుబట్టలతో, తన వెంట వచ్చేసింది. మెడలో ఓ బంగారు చెయిన్. చేతికి నాలుగు బంగారుగాజులు, వాచీ, చెవులకు పెద్దపెద్ద బుట్టలోలకులూ, సూట్‌కేస్‌లో ఐదారు జతల బట్టలూ, కాళ్లకు జోళ్లు తప్ప తన అభిరుచిమేరకు ఆమె ఏమీ తెచ్చుకోలేదు- తనవి అంటూ!

ఓ చారు, పచ్చడితో అన్నంతిన్నా మనిపించిన రోజులున్నాయి.... ఇలాటి చలికాలంలోనే, చాపమీదే- తనలో వదిగిపోయి, అమాయకంగా నిద్రించిన రోజులున్నాయి.... ఇష్టమైన సినిమా వచ్చి వెళ్తున్నా, బడ్జెట్ తగ్గుతుందని....వొద్దని తనే నవ్వుతూ చెప్పిన సందర్భాలూ వున్నాయి. అలాటి సీతకు ఆమె పర్సనల్ బంధుత్వాలనీ, వారు ఆమెమీద ప్రేమతో ఇచ్చే కానుకలనీ తను నిరాకరించటం సంస్కారం కాదా?

"సర్లె! ఉంచెయ్! ఈ రేడియోకథే నమ్మబుద్ధవటంలెదు!" అన్నాడు రామచంద్రం....

"ఔను! అబద్ధాలు చెప్పడం నాకూ కొత్త గనుక కథ అతకదు. అక్క, బావ, కొనిచ్చారిది....వద్దన్నా వినలేదు... మరెప్పుడూ అబద్ధాలు చెప్పను.... నా చేత చెప్పించకండి." అంది సీత సిగ్గుపడుతూ....

రామచంద్రం నవ్వేశాడు.

ఆ రోజు రామచంద్రం వచ్చేసరికి సీత ముఖం కందగడ్డలా చేసుకుని వుంది కోపంగా.

"ఏమిటి సీతా ఏం జరిగింది?" అన్నాడు రామచంద్రం ఆదుర్దాగా- ఈమధ్య సీతకి ఒంట్లో బావుండటంలేదు. వేవిళ్లమూలంగా, తరచూ వాంతులు అవుతూండటంతో స్కూలుకి శలవు పెట్టింది పదిరోజులు....

"అమ్మ ఉత్తరం వ్రాసింది."

"నిన్ను పిల్చికెళతాననా?"

"ఊఁ!"

"వెళ్లిరా!"

"వెళ్లి వూరికే రావటంకాదు. ఏదో తేల్చుకుని మరీవస్తాను."

"ఏమిటా తేల్చుకునేది?" ఆశ్చర్యంగా అడిగాడు రామంచంద్రం....

"అన్నయ్యలిద్దరూ చాలా పేచీలు పెడుతున్నారట...."

"ఏ విషయమై?"

"ఆస్తి విషయమై! మా నాన్నకు నాలుగెకరాల పొలం, ఓ పెద్ద మేడ వున్నాయి.... కొంత క్యాష్ వుంది...."

"ఎంతుంటే మనకెందుకు సీతా!"

"అలా అనకండి. స్త్రీని స్త్రీలూ, పురుషులూ కూడా మోసంచేస్తున్నారు మనదేశంలో." ఎమోషనల్‌గా అంది సీత....

"ఇప్పుడు నిన్నెవరు మోసగించారు సీతా" ఆందోళనగా అడిగాడు రామచంద్రం.

"అన్నయ్యలిద్దరూ. అమ్మ బాధ అదే. అక్కకు పదిహేనువేలు కట్నం ఇచ్చి' పది సవర్నలబంగారం పెట్టి, పదివేలు ఖర్చుపెట్టి పెళ్లిచేశారు కదా? నాకేం ఇచ్చారు? పైసా పుచ్చుకోలేదు మనం.... నాన్న చెప్పారుట, ఆడపిల్లకు ఆస్తిలో వాటా ఇవ్వండిరా అని. ససేమిరా అన్నారుట వాళ్లిద్దరు.... ఏం మగపిల్లాడికి ఆస్తిలో వాటావుండగా, ఆడపిల్లకి నాకుండకూడదా ఏమిటి?" జబర్దస్తీగా అంది సీత.

ఈ మధ్యే రామచంద్రం ఆడపిల్లకు ఆస్తిలో వాటా ఇవ్వటం న్యాయమనీ, అలా జరిగిననాడు వరకట్న దురాచారం సమసిపోతుందనీ వ్యాసాలు వ్రాశాడు రెండు ప్రముఖ ఇంగ్లీషు వారపత్రికలలో.

"అవుననుకో....ఇప్పుడు నీకా ఆస్తి లేకున్నా మునిగిపోయేదేముంది? నేను నిన్ను పోషించలేననటం లేదుగా....?" అన్నాడు రామచంద్రం.

"మీరలా ఏనాడూ అనరు.... కానీ, రేపొద్దున అన్నయ్యలిద్దరూ మా అమ్మ, నాన్నలని కూడా పోషించరనుకోండి. వాళ్లు నా దగ్గరనో, అక్కదగ్గరనో వుండాలి కదా? మనకూ ఓ బాబో, పాపో పుడతారు. ఖర్చులు పెరుగుతాయి ... మా అమ్మానాన్నల పోషణ మనకూ భారం కావొచ్చు.... అంచేత కొంత వాటా నా పేరుతోనూ వుంటే, వాళ్లకీ బాధవుండదు, తేరగా తింటున్నామని. మనకూ బాధ వుండదు, అదనపు బరువొచ్చిపడిందని ....నా ఆలోచన కరెక్ట్ కాదంటారా?"

రామచంద్రానికి ఏమీ పాలుపోలేదు. ఔననిపిస్తోంది, కాదనిపిస్తోంది.

"ఏమిటో సీతా! అంతా గొడవగా వుంది. పెదవఆస్తి ఇవ్వకున్నా, మీ అమ్మా నాన్నలొచ్చి మనదగ్గరున్నా నేనేమీ అనుకోను!" అన్నాడు క్రాప్పేసపాగి.

"మీ రనుకోరు. నే ననుకుంటాను. మీ అమ్మానాన్నల దగ్గర మీరు వాటా పంచుకున్నారా లేదా? మరి మా వాళ్ల దగ్గర నేనూ పంచుకుంటాను. ఆస్తిలేని వాళ్ల విషయమైతే అది వేరేసంగతి. అప్పులుంటే అదీ వేరేసంగతి.... అప్పులులేక, ఆస్తివుండీ, వచ్చే వీలుంటే



నేను చచ్చినా వద్దనను. నా పుట్టబోయే బిడ్డల భవిష్యత్తు దృష్ట్యా, వాళ్ళకి నేను కల్పించవలసిన ఆర్థిక వనరులు, ఆర్థిక భద్రత దృష్ట్యా నేను, సిల్లీ సెంటిమెంట్సుతో వచ్చే రాబడిని కాలదన్నుకోను.... అక్కకి ఆ ముచ్చటనీ, ఈ ముచ్చటనీ, వేలువేలు ఖర్చుపెట్టారు. నాకవన్నీ బాకీపడ్డారు.... నేనూ వద్దన్నాను! ఎందుకని? నా పుట్టబోయే బిడ్డల కవి పెట్టుబడిగా దాచుకుందామని.... ఇది స్వార్థం అనుకోకండి. ప్రతి తల్లికీ వుంటుందిలాటి స్వార్థం. వుండాలి కూడాను. లేకపోతే బిడ్డలు బికారివెధవలైపోతారు...."

రామచంద్రం విభ్రాంతపోయాడు. సీత క్లాసులో పాఠంచెప్పినట్లు చెప్పుకపోతోంది ఆగకుండా.


మర్నాడు సీత ప్రయాణమై వెళదామనుకుంటుండగా, పెద్ద బావమరది భాస్కరం వచ్చాడు.

"బావా! ఇదుగో చెక్కుబుక్కు." అన్నాడు.

"ఏమిటి?" ముఖం చిట్లిస్తూ అన్నాడు రామచంద్రం.

"చెల్లాయి పెళ్ళికిగాను కట్నానికీ, పెళ్ళిఖర్చుకీ కలిపి పాతికవేలు విలువ చేసి వుంచారు నాన్న.... దాని వంటిమీద పది సవర్ల బంగారం వుండనేవుండే .... తీరా మీరు పెళ్ళిఖర్చు కూడా లేకుండా చేసేసుకున్నారు కదా పెళ్ళి.... ఆ డబ్బులాగే సీతపేరుతో ఫిక్సెడ్ డిపాజిట్ వేసివుంచాం.... పదేళ్ళకు ముప్పైఐదు వేలకుపైగా అవుతుంది. దానిష్టం. అదేం చేసుకున్నా మాకు సంబంధంలేదా డబ్బును...."

రామచంద్రం ఏదో చెప్పబోయే లోగా, సీత వచ్చింది గబగబా. ఆ చెక్కుబుక్కు అన్న చేతిలోంచి తీసుకుంటూ అంది నవ్వుతూ.




"ఆయన విలాటివి ఒప్పుకోరురా అన్నయ్యా! నాకివ్వు. రేపొద్దున నీమేనకోడలికి మీ బావగారిలాటి భర్తే వస్తారని నమ్మకం ఏమిటి? కట్నం పుచ్చుకుంటానంటే ఇవ్వొద్దూ. అన్ని ధరలూ మండిపోయినట్లే, ఆ నాటికి కట్నం రేటు యాభై వేలో, లక్షో కావొచ్చు.... ఎవరిస్తారానాడు? మా ఇద్దరి జీతాలూ.... మా సంసారానికి సరిపోతున్నాయి.... ఇంకా టి. వి. కొనాలి...." అంది ఏక బిగిన.... అరిందాలా చేతులు తిప్పుతూ.

రామచంద్రం విస్తుపోయాడు

భాస్కరం నవ్వాడు. "ఎందుకలా ఆశ్చర్యపడతావ్ బావా? ఈ ఆడాళ్లంతా ఇంతే! ఇంకా దీనికి ఐదో నెల అన్నా రాలేదు. అప్పుడే పుట్టబోయే పిల్లకి కట్నానికి డబ్బు జాగ్రత్త చేస్తోంది చూడు.... రేపు నావెంటరావే సీతా! అమ్మ సీమంతం చేస్తుందిట నీకు!" అన్నాడు

"ఊహుఁ! సీమంతం ఒద్దురా అన్నయ్యా! మీ బావ కిష్టంలేదు. నాకూ ఇష్టం లేదు. ఆ ఖర్చు పెట్టవల్సికున్న డబ్బేదో నాకివ్వు. నా కిష్టమైన వస్తువు ఏదేనా కొనుక్కుంటాను!" అంది సీత నసుగుతూ.

"ఆల్‌రైట్! నీ ఇష్టం. నీ డబ్బు నీకు చెందేలా చేస్తున్నాం. ఇంకా ఆస్తీ పాస్తీ అంటావా?" భాస్కరం నవ్వుతూ అన్నాడు.

"నా కెందుకురా అన్నయ్యా మీఆస్తి? నాకు న్యాయంగా రావలసిందేదో మీరిస్తారని నాకు తెలుసు.... కానీ ఈయనగారికి చెప్పుకోవాలి కదా ముందస్తుగా!" అంది.

పదిరోజుల తర్వాత.... ఓ చల్లని రాత్రి రామచంద్రం, సీత సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.... పుట్టబోయేది బాబైతే, వాడిని డాక్టరునో, మంచి యాక్టరునోచేయాలన్నాడు రామచంద్రం. పుట్టబోయేది ఆడపిల్ల అయితే, దానికి చక్కగా, సంగీతం, డాన్సు నేర్పించాలంది సీత....

"మీ అమ్మ నీకు సీమంతం చేస్తానంటే వద్దన్నావెందుకు సీతా! నీకు మనసులో కోరికలేదూ సీమంతం చేయించుకోవాలని?" అన్నాడు రామచంద్రం. సీత తనకోసం కోరికల్ని చంపుకొంటోందేమో ననిపించింది ఎందుకో ఆ రోజు.

సీత నవ్వింది. "నాకేం అలాటి పిచ్చి కోరికల్లేవు. ఈ రోజుల్లో అలాటి కోరికల ఖరీదెంతో నాకు బాగా తెల్సు. సీమంతం అంటే, ఓ పట్టు చీరె, పేరంటం.... మన ప్రయాణపు రానుపోను ఖర్చులూ అంతా లెక్కవేసుకుంటే, సుమారు రెండువేల రూపాయలౌతుంది, మా అమ్మనాన్నలకి. మనకీ ఓ ఐదారు వందలు వదులుతుంది పార్మాలిటీస్‌కి! ఎందుకొచ్చిన దండగ? నేను అమ్మానాన్నల దగ్గర పదిహేనువందలూ తీసుకున్నాను. మనదో ఐదువందలు కలిపి, చక్కటి వస్తువు తీసుకున్నాను... చూపనా?"

"చూపించు." కుతూహలంగా అడిగాడు రామచంద్ర

సీత లోపలికి వెళ్లి వచ్చింది. గుప్పిట మూసి మురిపెంగా అంది. "నేను చాలా రోజులుగా కలలుగంటున్న వస్తువిది. మీరు నా ముద్దు చెల్లిస్తారని ఆశతో.... ధైర్యంచేసి తీసుకున్నాను...." అంది మృదువుగా. రామచంద్రం నవ్వాడు.... "సీతా! నువ్వంతగా కలలుగంటున్న వస్తువు, నాకు చెబితే, నేనైనా కొనేవాణ్ణి గదా...." అన్నాడు ప్రేమగా.... సీత మెల్లిగా గుప్పిట విప్పింది ఆమె తెల్లని అరచేతిలో.... తళతళ మెరుస్తున్న రెండు బంగారు మంగళసూత్రాలు, పసుపుపచ్చని తాడులో వేసి వున్నాయి...

"సీతా!" రామచంద్రం ఆశ్చర్యంగా అరిచాడు....

"నామీద నమ్మకం సడలిపోయిందా?" అన్నాడు బాధగా....

"ఛ.... ఛ.... నమ్మకం సడలిపోవటమేమిటి? కలిసి కాపురం చేస్తున్న మనం నాటికీ, ఏనాటికీ భార్యాభర్తలమే.... కానీ, నాకే ఇవంటే ఎంతో కోరిక.. మీకిలాటివి ఇష్టంలేదని కోరిక అణచుకున్నాను.... అమ్మ మెళ్లో, అక్క మెళ్లో, వదినెలమెళ్లలో, స్నేహితురాళ్లందరి మెళ్లలో ఈ అపురూపమైనవి వున్నాయి.... పిల్లలు మురిపెంగా తల్లి మెడలోని మంగళసూత్రాలతో ఆడుకోవటం చూశాను.... అలాటి దృశ్యం చూసినప్పుడల్లా నాకేమిటో వెలితి అవి

పిస్తోంది.... రేపు బాబో, పాపో పుట్టాక వాడు నా పాలుతాగుతూ, మంగళ సూత్రంతో ఆడుకోవటంలోని ఆనందపు అనుభూతిని నేనూ పొందాలనే తీవ్ర కాంక్ష నాలో రేగింది. ఊహ తెలిశాక మన పిల్లలు "నీ మెడలో అలాటివి లేవేం అమ్మా?" అంటే మన ఆదర్శాలు, నమ్మకాలు, జవాబులు చెబితే వాళ్లకేం అర్థమవుతుంది?"

అతగాడి చేతిలో మంగళసూత్రాలు పెడుతూ అంది సీత.

రామచంద్రం క్షణకాలం పలకలేదు. మౌనంగా వాటికేసి చూస్తూ కూర్చున్నాడు.

"ఈ చల్లని వెన్నెలలో.... మీ చేత్తో అవి నా మెడలో కట్టించుకుని.... మీరు సుతారంగా మంగళసూత్రాల్ని చూస్తుంటే.... మైమరచిపోవాలని అనుకున్నాను.... గర్భిణిగా ఆ కోరిక ఒక్కటే వుంది నాకు. మీకు ఇష్టంలేక పోతే ఒద్దులెండి.... రేపే ఇది మార్చేస్తాను. ఆ డబ్బు బ్యాంకిలో వేసేస్తాను..." అంది సీత. ఆమె కళ్లలో లీలగా తడి మెరిసినట్లయింది....

రామచంద్రం నవ్వాడు...."ఈ చిన్న కోరిక తీర్చకపోవటమేమిటి సీతా.... ఇలారా.... ఊఁ! మెడ వంచు.... ఓ అష్టదిక్పాలకులారా! ఆదిశేషుడా! సూర్యచంద్రులారా! పక్కనున్న మేడలారా! గోడలారా! వినండి.... వినండి.... ఈవిడ....ఈ సీత.... బి.ఎస్.సి.... ఈ క్షణం నుంచీ నా సహధర్మచారిణి....వినండి...వినండి.. ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ నాతి చరామి.... నాతి చరామి.. మాంగల్య తంతునానేన, మమ జీవన హేతునా.... కంఠే బధ్నామి శుభగే.... జీవంతు.... శరదాశ్శతమ్....మంత్రాలు అవి ఔనో కాదో, మంత్రపూతంగా మాంగల్యధారణ జరిగింది.... కానీ మరో విషయం తెల్పుతున్నాను.... ఈ సీత అనబడే నారిచేత సంపూర్ణంగా మోసగింపబడ్డాను...."

"ఉష్! ఏమిటా గొడవ?" అంది సీత, ఆమె తన మెడలోని మంగళ సూత్రాలని అపురూపంగా చూసుకుంటోంది.... భర్తని ప్రేమగా మందలిస్తూనే, అతగాడి భుజంమీద తల వాల్చింది నిశ్చలంగా....

ఆ మైమరపులో రామచంద్రం నిట్టూర్పు గాలికెగిరిపోయి, అతగాడూ కొత్తగా ఆమె మెడకేసీ, ముఖంలో కొత్త పెళ్లికూతురిలాటి కళకేసి చూస్తుండిపోయాడు. గెలుపెవరిది? అన్న ప్రశ్న ఉదయించినా, ఆ గెలుపులోని మాధుర్యం గమ్మత్తుగా వుంది అతగాడికి....

